ప్రజాశక్తి

బుధవారం 26 ఫిబ్రవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ప్రచారం సమాప్తం

- ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 25 మంది -2 లో
- నేడు పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

పోలింగ్ సజావుగా నిర్వహిస్తాం

- అభ్యర్థులు, ఏజెంట్లు నిబంధనలు పాటించాలి
- పోలింగ్ సిబ్బంది ఇచ్చిన పెన్నునే ఓటర్లు వాడాలి
- రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి -2 లో

భూ వివాదాలు, ఆర్థిక వ్యవహారాల మాటేమిటి?

సోషల్ మీడియాలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పట్టభద్రుల ప్రశ్నలు -2 లో

నేడు కోటప్పకొండ తిరునాళ్ల

రాష్ట్ర పండుగ నిర్వహణకు సర్వం సిద్ధం -2 లో

భూ వివాదాలు, ఆర్థిక వ్యవహారాల మాటేమిటి?

సోషల్ మీడియాలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పట్టభద్రుల ప్రశ్నలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులు పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. పలు భూ వివాదాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి పలు అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టభద్రులు సంధించిన ప్రశ్నలివి ఉన్నాయి.

1. విజయవాడకు చెందిన బ్రాహ్మణ సామాజిక తరగతి 1969లో ప్రారంభించిన శ్రీ దుర్గా మల్లేశ్వర ఎడ్యుకేషనల్ (శాతవాహన కళాశాల) సొసైటీలోకి తెనాలికి చెందిన మీరు ఎలా చొరబడ్డారు?

2 .మీరు ఆ సొసైటీ సెక్రటరీ/కరస్పాండెంట్‌గా ఎన్నికవ్వడం చట్టరీత్యా చెల్లుబాటు కాదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు నిజం కాదా?

3. ఫిబ్రవరి 17, 2017న కృష్ణా జిల్లా సొసైటీ రిజిస్ట్రార్ జి.ప్రజాపతిరావు కార్యదర్శిగా, నిడమోలు రమా సత్యనారాయణ సంయుక్త కార్యదర్శిగా మరికొంత మంది సభ్యులతో ఉన్న యాజమాన్య కమిటీని ఆమోదించగా, 30-03-2017న అప్పటి కాలేజి ఎడ్యుకేషన్ స్పెషల్ కమిషనర్ పండాదాస్ ఆ నియామకాన్ని ఆమోదించిన మాట వాస్తవం కాదా?

4. అయితే మీ వత్తిడి మేరకు పండాదాస్‌తోనే ఆ మరుసటి రోజునే ఆ ఆమోదాన్ని రద్దు చేయిస్తూ ఆదేశాలు ఇప్పించటం వాస్తవం కాదా?

5. జిల్లా సొసైటీ రిజిస్ట్రార్‌పై వత్తిడి తెచ్చి తన వారితో ఉన్న కమిటీని మీరు ఆమోదింప చేసుకుని అక్రమాలకు పాల్పడటం ఎంత వరకు న్యాయం?

6. మీకు అనుకూలంగా అక్రమంగా మార్చుకున్న కమిటీని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేసి పాత కమిటీని పునరుద్ధరిస్తూ ఆదేశాలు ఇవ్వడం వాస్తవం కాదా?

7. హైకోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్న ఈవ్యవహారంలో మీరు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం అక్రమమేకాక కోర్టు ధిక్కారణ కాదా?

8. మీ వ్యవహారాలన్నింటినీ 2017లో అప్పటి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఆర్‌వి.కష్ణారావు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ఎందుకు రాయాల్సి వచ్చింది?

9. విజయవాడ భవానీపురంలో డంకన్ టీ వారి 3 ఎకరాల స్థలం కబ్జాలో మీ పాత్ర ఏమిటి?

10.రాజధాని ప్రాంతం ఉండవల్లిలో సొంత టిడిపి నేత స్థలాన్ని ఎవరు కబ్జా చేశారు?

11. గతంలో టిడిపికే చెందిన విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు, అప్పటి ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న, ఆనాడు టిడిపిలో ఉన్న వల్లభనేని వంశీమోహన్ ప్రెస్‌మీట్లు పెట్టి ఎండగట్టి, హెచ్చరించిన మాట వాస్తవం కాదా?

12. మీ భూ వివాదాలు, ఆర్థిక వ్యవహారాలపై అన్ని రకాల మీడియాల్లో వార్తలు, కథనాలు వచ్చిన మాట వాస్తవం కాదా?

13. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఇన్ని వ్యవహారాల్లో కూరుకుపోయిన మీరు ఎంఎల్‌సిగా ఎన్నికైతే మేము ఇంకెన్ని వ్యవహారాలు చూడాల్సి వస్తుందొ ?

తిరునాళ్ల బందోబస్తుపై ఐజి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రజలు ప్రశాంత వాతావరణంలో త్రికోటేశ్వరున్ని దర్శించుకునేలా సిబ్బంది సహకారం అందిస్తూ విధులు నిర్వహించాలని పోలీసులకుగుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. కోటప్పకొండ తిరునాళ్ల ఉత్సవాలకు బందోబస్తు నిర్వహించడానికి హాజరైన 2500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కోటప్పకొండలోని జెడ్‌పి పాఠశాలలో ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి ఐజి సమావేశమయ్యారు. తిరుణాళ్ల జరిగే పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

ప్రచారం సమాప్తం

- ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 25 మంది
- నేడు పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ముగిసింది. అభ్యర్థులంతా గురువారం జరిగే పోలింగ్‌పై దృష్టి సారించారు. ఏజెంట్ల నియామకం, పోలింగ్ శాతం పెంపునకు కసరత్తు చేస్తున్నారు. 25 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా రెండు జిల్లాల పరిధిలోని 33 నియోజకవర్గాల్లో 3,47,116 మంది ఓటర్లున్నారు. అభ్యర్థులు దాదాపు నెల రోజుల పాటు ప్రచారం చేసినా ఎక్కువ మంది ఓటర్లను అభ్యర్థులు కలవలేకపోయారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ మంది ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల్లో ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి అయిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య నెలకొంది. ఈ ఎన్నికల్లో భారీ బహిరంగ సభలు, పెద్ద సమావేశాలు ఏమీ నిర్వహించకుండానే ప్రచారం ముగిసింది. 14 ఏళ్ల ఎమ్మెల్సీగా పనిచేస్తున్న లక్ష్మణరావు పట్టభద్రులకు సుపరిచితులు కావడంతో ఆయనకు ఆయా ప్రాంతాల్లో మంచి ఆదరణ లభించింది. లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, రైతు, కౌలు రైతు సంఘాలు, చేనేత కార్మికులు, స్కీం వర్కర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, గోపిమూర్తి, మాజీ

ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, డాక్టర్ గేయానంద్, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు, జిల్లా ముఖ్య నాయకులు వివిధ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. ప్రజలతో ఉన్న సత్సంబంధాలు లక్ష్మణరావుకు కలిసి వస్తున్నాయి. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తి లక్ష్మణరావు ప్రచారంలో స్పష్టంగా కన్పించింది.

ఎన్నికలకు సంబంధించి మొత్తం 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. బుధవారం గుంటూరు ఎసి కళాశాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రితో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సామగ్రి సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయడం బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసి పోలింగ్ స్టేషన్ వారీగా పంపిణీ చేసేందుకు స్థానిక ఎసి కళాశాలలో ఏర్పాట్లు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఇలానే ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లుగా 140 పోలింగ్ కేంద్రాలను గుర్తించిఅదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఉద్యోగులకు సెలవుపై సందిగ్ధం

శాసనమండలి ఎన్నికల్లో ఓటర్లైన ఉద్యోగులందరూ ఓటేసేందుకు వీలుగా యాజమాన్యాలు పోలింగ్ రోజు గురువారం ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వ్యాపార, విద్యాసంస్థలు వారి సంస్థల్లోని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటానికి సెలవు కోరితే మంజూరు చేయాలని ఆదేశించారు. అయితే పూర్తిగా సెలవు ఇవ్వాలని, ఒకచోట ఉద్యోగం చేస్తూ మరోచోట ఓటుంటే ఇబ్బంది అవుతుందని రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశాయి. పోలింగ్ రోజున సెలవు ఇవ్వాలని టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పోలింగ్ సజావుగా నిర్వహిస్తాం

- అభ్యర్థులు, ఏజెంట్లు నిబంధనలు పాటించాలి
- పోలింగ్ సిబ్బంది ఇచ్చిన పెన్నునే ఓటర్లు వాడాలి
- రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ఉంటుందని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థల ఉద్యోగుల గుర్తింపు కార్డు, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, విభిన్న ప్రతిభావంతులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు తదితర 10 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఓటర్లు చూపాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని వెళ్లరాదన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలను తెలపడానికి తహశీల్దార్ల కార్యాలయాలలో, కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేకంగా కేంద్రాల్లో ఓటర్ల జాబితాతో ఉద్యోగులు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేసినా వివరాలు తెలియజేస్తారన్నారు. శాసనమండలి ఎన్నికలు మొదటి ప్రాధాన్యత విధానం ద్వారా ఓటేయాల్సి ఉంటుందని, ఓటు చెల్లుబాటయ్యేలా మార్గదర్శకాలను వివరిస్తూ పోలింగ్ బూత్‌ల వద్ద పోస్టర్లను ప్రదర్శిస్తామని తెలిపారు. 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పేపర్లో వారి సీరియల్ నంబరు, పేరు, ఫొటో, ఏ పార్టీ తరుపున పోటీ చేస్తుందని వంటి వివరాలతో కూడిన పోస్టర్‌ను పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బ్యాలెట్ పేపరు పై ప్రాధాన్యత ఓటు అంకెల నమోదుకు పోలింగ్ అధికారులు బ్యాలెట్ పేపరుతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్నును ఇస్తామని, దీని ద్వారా మాత్రమే బ్యాలెట్ పేపరుపై ప్రాధాన్యత ఓటేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఓటర్లు వారి స్వంత పెన్నులతోనే ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు.

అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించితే సీరియస్‌గా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, వారిని బెదిరించటం వంటి ఫిర్యాదులుంటే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూంకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేయకూడదని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లు, 200 మీటర్ల లోపు పోలింగ్ రోజు ప్రచారం నిషేధమని అన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలించటం వంటి కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ ప్రారంభానికి గంట ముందే పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పెన్ను పెన్సిల్, వారికి సంబంధించిన ఇనుప సీలు, ఓటర్ల జాబితాను పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్ళొచ్చని తెలిపారు. పోలింగ్ పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలను మూసేస్తామన్నారు. పోలింగ్ రోజు ఓటర్లకు ఇబ్బందులు, పోలింగ్ సంబంధించి ఇతర సమస్యలు ఒటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబరు 0863 2241029కు ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని కోరారు.

ఆర్థిక అక్రమాల్లో ఆలపాటి ?

రూ.60.19 కోట్ల సేవా పన్నులు చెల్లించకుండా కాలయాపన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆర్థిక వ్యవహారాలు ఒక్కొక్కటి తెరపైకి వస్తుండడంతో ఆయనకు ఎదురుగాలి వీస్తోంది. ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థలను నడుపుతున్న ఆలపాటి ఆ విద్యా సంస్థల ద్వారా విద్యార్థుల నుండి వసూలు చేసిన ఫీజులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన సర్వీసు టాక్స్ వ్యవహారాలు చర్చనీయాంశమవుతున్నాయి. సర్వీసు టాక్స్‌ను చెల్లించకుండా ఏళ్ల తరబడి వాయిదా వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల మొత్తంలో ప్రయివేటు విద్యా సంస్థల వారు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని సేవా పన్నుగా చెల్లించాలి. ఆలపాటి నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థలు విద్యార్థుల నుంచి ముక్కుపిండి భారీగా ఫీజులు వసూలు చేశాయి. ఈ ఫీజులకు సంబంధించి రూ.60 కోట్ల 19 లక్షల 17 వేల 794 మేర సేవా పన్నును కేంద్రానికి చెల్లించాలి. ఈ పన్ను చెల్లింపులపై 2013-14లో కేంద్ర సంస్థలు నోటీసులూ ఇవ్వగా ఆయన ట్రిబ్యునల్‌కు వెళ్లారు. అప్పిలేట్లో దానిని కొట్టివేయగా ఆయన హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు కూడా ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ తర్వాత 2018లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది. ఇలా సేవా పన్ను చెల్లించకుండా ఆలపాటి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

భూ వివాదాలు

ప్రభుత్వ ఈనాం భూములను ఆక్రమించిన ఆలపాటిపై చర్యలు తీసుకోవాలని జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేసింది. పలకలూరులోని సర్వే నంబర్ 272, 280, 281లో 46.82 ఎకరాల ఈనాం భూమిని 2004లో ఆక్రమించి లే అవుట్ వేశారని, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పద్మావతి నగర్ పేరుతో వెంచర్ వేసి భూములమ్మి రూ.కోట్లు గడించారని సంఘం ఆరోపించింది.

నేడు కోటప్పకొండ తిరునాళ్ల

రాష్ట్ర పండుగ నిర్వహణకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర పండుగైన కోటప్పకొండ తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. త్రికోటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలు తీర్చిదిద్దారు. తిరునాళ్లకు 25 లక్షల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లతోపాటు 2500 మంది పోలీసు సిబ్బందిని, 50 మంది క్రైమ్ పార్టీ పోలీసులు, 15 డ్రోన్ కెమెరాలు, 300 సిసి కెమెరాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరోవైపు 22 భారీ విద్యుత్ ప్రభలు కొలువుదీరనున్నాయి. ఇప్పటికే గురవాయపాలెం, కాకాని, పురుషోత్తపట్నం నుంచి 4 ప్రభలు, కావూరు, కమ్మవారిపాలెం, కోమటినేనివారిపాలెం, అమీన్‌సాహెబ్‌పాలెం, యడవల్లి, అప్పాపురం, మద్దిరాల, గోవిందాపురం, ఉప్పలపాడు గ్రామాల నుంచి ప్రభలు కొండకు బయలుదేరాయి. మొక్కుబడి ప్రభలు 80 వరకు రానున్నాయి. ప్రభలపై ఆయా రాజకీయ నాయకుల

ఫొటోలు, పాటలు పెట్టొద్దని పోలీసులు షరతులు విధించారు. దీనికి సంబంధించి భారీ విద్యుత్ ప్రభ నిర్వాహకుల వద్ద నుండి రూ.2 లక్షలు, చిన్న ప్రభ నిర్వాహకుల వద్ద నుండి రూ.50 వేలతో పాటు ప్రభ నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెల్లవారుజాము నుండే దర్శనం

తెల్లవారుజామున 3 గంటలకు బిందె తీర్థంతో ప్రత్యేక అభిషేకం అనంతరం దర్శనానికి అనుమతిస్తారు. ఇందుకోసం ఆరు క్యూలైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500, అభిషేక దర్శనం, వివిఐపి దర్శన అవకాశం కల్పించారు. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు ఇబ్బందులు రాకుండా చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రసాదాలైన లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు. క్యూలైన్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసేందుకు చర్యలు చేపట్టారు. త్రికోటేశ్వరస్వామికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఆయనతోపాటు పల్నాడు జిల్లా ఇంఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరుకానున్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - కొల్లిపర

గుండెపోటుతో ఉపాధి హామీ మహిళా కూలి మృతి చెందినట్లు ఏపీవో మండ రవి తెలిపారు. కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన గమ్మిడి శివమ్మ (52) మంగళ వారం ఉదయం ఉపాధి హామీ పథకంలో భాగంగా దావులూరు పంట కాలువల పూడిక తీసే పనికి వెళ్లారు. పని ప్రదేశంలో ఉదయం 11 గంటలకు ఒకసారిగా కుప్పకూలి పోయారు. పరిశీలించిన తోటి కూలీలు ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

ఆలపాటిని గెలిపించాలని ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి - పెదకూరపాడు, ముప్పాళ్ల

పెదకూరపాడు లోని కాకతీయ కాలేజ్ , స్కూల్ టీచర్లను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రకు ఓటు వేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మరియు పరిశీలకులు నల్లపాటి రాము గారు, కేకే చౌదరి కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల కోసం, యువత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన తెలిపారు. ముప్పాళ్లలో టిడిపి నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ పర్యటించి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లా డుతు ఆలపాటిని గెలిపించాలని ప్రచారం నిర్వహించామనీ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల నాగేశ్వరరావు,రావిపాటి మధుబాబు, పూజల వెంకట కోటయ్య,రావిపాటి నానయ్య,శిరిగిరి పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి తిరువీధుల శారద ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏమీ నిలబెట్టుకోవడం లేదని కృష్ణ గుంటూరు జిల్లాల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి, హైకోర్టు న్యాయవాదితిరువీదుల శారదా తెలి పారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా గుంటూరు లోని పలు ప్రాంతాల్లో ఆమె మంగళ వారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికఅంబేద్కర్ భవన్ లో మీడియా తో మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల సమస్యలను టిడిపి కూటమి ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, వాలెంటీర్ల, సచివాలయం ఉద్యోగుల ఇబ్బందుల గురించి మండలి లో చర్చిస్తామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని

పెదకాకాని పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక కాళీ వనాశ్రమంలోని గోశాలలో విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మృతి చెందిన నలుగురిలో ముగ్గురు యానాది కులస్తులు ఉన్నారని వీరు అత్యంత పేదలని, వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యానాది కులస్తులు, కుటుంబ సభ్యులు, యానాది సంఘ రాష్ట్ర నాయకులు జవాది వెంకటసుబ్బయ్య, బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జి ఆర్ భగసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాతికొండ నరసింహారావు, ఆర్పిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల ముత్తయ్య, నాయి బ్రాహ్మణ జేఏసీ గుంటూరు నగర కన్వీనర్ టి శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున యానాది సంఘం నాయకులు మహిళలు పాల్గొని వారి కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రజాసంఘాలుగా తాము మద్దతును తెలియజేశారు. రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలు తమవి అని అలాంటిది కుటుంబాలను పోషించే వ్యక్తులు మరణిస్తే తమని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు ధర్నా విషయం తెలుసుకున్న ఆర్డిఓ కమ్మ శ్రీనివాసరావు, డి.ఎస్.పి మురళీకృష్ణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని బాధిత కుటుంబాలతో చర్చించారు. ఆర్‌డిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ చనిపోయిన కుటుంబాలకు రెండు సెంట్లు స్థలము గృహ నిర్మాణానికి ప్రభుత్వం అందించే రుణము ఏర్పాటు చేస్తామన్నారు. విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని తెలియజేశారు. దీనితో వారు ధర్నాను విరమించారు. చర్చలలో తాసిల్దార్ పి.కృష్ణకాంత్, సి.ఐ టి.పి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ మెటీరియల్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి రేపు జరిగే పోలింగ్‌కు సంబంధించి స్థానిక ఏ.సి కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఫిబ్రవరి 26న పోలింగ్ మెటీరియల్‌ను పోలింగ్ సిబ్బందికి అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానంగా పంపిణీ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించే విధంగా ఉండాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తర్వాత వారిని పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా చేర్చేందుకు రూట్ల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం , మంచినీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. ఫిబ్రవరి 27న ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుండి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరిచేందుకు గదులను పరిశీలించారు. ఈసందర్భంగా బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ఏ.సి కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా సజావుగా పోలింగ్ మెటీరియల్‌ను సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ కె.శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు , పశ్చిమ మండల తహశీల్దార్లు నగేష్ , వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఎక్సైజ్ సుంకం దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో కేంద్ర ఎక్సైజ్ సుంకం దినోత్సవాన్ని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పరిశ్రమలలో అవినీతిని నిరోధించటం, కేంద్ర పరోక్ష పనులు, ఎగుమతులు, దిగుమతులు పన్నులపై అవగాహన కల్పించి, విద్యార్థినులకు బృంద చర్చలు, పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి జె.ప్రమీలారాణి, ఎం.అంజనాదేవి, జి.సరోజ, షేక్.సుభాని పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన 36 గంటల హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు : మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో టెక్నో ఫ్యూచర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఓటి రోబోటిక్స్‌పై రెండ్రోజులపాటు నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో డైనిష్ సిఇఒ మొహమ్మద్ కరిముల్లా, మలినేని విద్యా సంస్థల అధినేత డాక్టర్ పెరుమాళ్ల పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో ఐఓటి టెక్నాలజీతో స్మార్ట్ సొల్యూషన్, హోమ్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ అంశాలపై 23 ప్రాజెక్టులు రూపొందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ యుగంలో డివైజ్‌ల మధ్య కనెక్టివిటీ, ఆటోమేషన్, డైటా అనాలసిస్ తదితర రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కృషి చేయాలని, సాంకేతిక రంగంలో ట్రెండింగ్ సెట్ చేసే విధంగా వారి మేధస్సుకు పదును పెట్టాలన్నారు.

ఓటింగ్ సజావుగా జరిగేలా చర్యలు

- ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ కరుణ

ప్రజాశక్తి-గుంటూరు : ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓటింగ్ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు పటిష్టంగా చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల సాధారణ అబ్జర్వర్ వి. కరుణ నియోజకవర్గ పరిధిలోని కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్‌తేజతో కలిసి ఓటింగ్‌పై ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ మెటీరియల్ పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బందో బస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్ట్ ఏర్పాట్లు సత్వరమే పూర్తి అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్ ను విధించాలన్నారు. బైండవర్లు పూర్తి చేయాలని, పోలింగ్ రోజు డ్రై డేగా ప్రకటించి మద్యం షాపులు మూసివేయించాలన్నారు. ఓటు వేయటానికి వచ్చే వీవీపీలకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల కలెక్టర్లు మాట్లాడుతూ పోలింగ్‌కు చేపట్టిన ఏర్పాట్లను అబ్జర్వర్‌కు వివరి ంచారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అబ్జర్వర్...

స్థానిక లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో ఏర్పాటు చేసిన 227, 228, 229 పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను నియోజకవర్గ ఎన్నికల సాధా రణ అబ్జర్వర్ మంగళవారం పరిశీలించి తగు సూచనలు చేశారు.

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా జియావుద్దీన్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా సయ్యద్ జియావుద్దీన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. జియావుద్దీన్ విజయవాడలోని ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తూ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది గుంటూరు న్యాయవాసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు సీనియర్ డిఎల్‌ఎస్ఎ ప్యానెల్ న్యాయవాది కట్టా కాళిదాసు, న్యాయవాదులు, ఎల్ఎడిసి న్యాయవాదులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారికోర్టులో

I.P.No. 30/2020

Puligundram Gopi ...Petitioner

Verses

Pemdurthi Haripriya and 20 others ...Respondents

ఆక్షేపణ నోటీసు

R1) Pemdurthi Haripriya, W/o. Sai Pratap, D.Nol.1-7-1A, Vyshnavi Nagar, 1st Line, Ponnuru, Guntur Dist.,

పై నెంబరు ఐ.పి.లో పిటిషనరు తనని Insolvent గా డిక్లేర్ చేయమని పై కోర్టులో I.P. పెట్టి వున్నందున మీకు ఆక్షేపణలు వున్న యెడల తేది 5.3.2025న ఉదయం 10:30లకు పై కోర్టులో మీరుగాని, మీ తరపు లాయరు గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు

ఎ. కోటేశ్వర రావు

పిటిషనరు తరపున వకీలు, గూడూరు.

పత్రికా ప్రకటన

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు- వినుకొండ

ఓ.యస్. నెం.36/2022

పల్లెబోయిన తిరుపతయ్య .... వాది

ఎదిరి

ముత్తినేని నరసింహారావు ...... ప్రతివాది

టు:

ముత్తినేని నరసింహారావు తండ్రి పుల్లారావు, జె.కె.సి కాలేజి రోడ్డు, గుజ్జనగుండ్ల సెంటర్, గుంటూరుసిటీ. సెల్ నెం. 99084 32644.

పై నెంబరు దావాలోని ప్రతివాదినకు శ్రీ యుత కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్ని పర్యాయములు సమన్లు జారీచేసినను మీరు సమన్లు తీసుకొనని కారణముచే శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము తెలియజేయునది ఏమనగా మీరు ది. 04-03-2025 న ఉదయం 10-30 నిIలకు స్వయంగానను లేక మీ న్యాయవాది ద్వారాను పై కోర్టు నకు హాజరు కావలెనని, లేనియెడల దావాను శ్రీకోర్టు వారు మీ పరోక్షముగా తీర్పుచెప్పగలరని ఇందుమూలం గా మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా:- 04-03-2025

ఇట్లు

బత్తుల రమేష్, న్యాయవాది, లాయర్స్ స్ట్రీట్, కొత్తపేట వినుకొండ, 522647. పల్నాడు జిల్లా. సెల్.నెం. 9866408593

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE, (SENIOR DIVISION) NARASARAO PET.

E.P. No. 29/2022 O.S. No. 342/2018

Between :

Shaik Peeru Saheb ... D.H.R.

Vs

Kalluri Seethaiah (died) and others .... JDR 1 to 5

To,

JDR No. 4

Tatikonda Vara Lakshmi, W/o Subbaiah, D.No. 4-88, Bodduravi Centre, Yaddanapudi Village, Bapatla District.

పై నెంబరు గల ఇ.పి.లో మీకు పలుమార్లు నోటీసులు పంపగా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేసియున్నారు. కావున ది. 13-3-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీ యందు పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టువారి అనుమతితో)

వాయిదా : 13-3-2025

ఇట్లు

ఎం.హరీష్‌కుమార్, న్యాయవాది, నరసరావుపేట. సెల్ : 9000727483.

నోటీసు ప్రకటన

IN THE COURT OF THE PRL. JR. CIVIL JUDGE, TENALI

Dispute No. 17/2018

EP 106/2024

Between :

M/s Shriram Chits (P) Ltd, Tenali. Rep. by its Legal Managedr / GPA Holder .... D.H.R.

Vrs

Kanneganti Jhansi Rani & others ... JDRs

To,

కన్నెగంటి నాగార్జున, తండ్రి: నాగేశ్వరరావు, వ్యాపారం, నివాసం : డోర్ నెం. 22-6-72, కృష్ణారావు నాయుడు వీధి, కొత్తపేట, తెనాలి.

ప్రస్తుత అడ్రస్ : డోర్ నెం. 32-121/1ఎ, అక్షయ జువెల్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. 502, సరళానగర్, సుల్తానాబాద్, తెనాలి.

పై నెంబరు ఇ.పి. 106/2024లో పై కోర్టువారి ఉత్తర్వుల మేర మీకు తెలియజేయునది ఏమనగా మీ యొక్క స్థిరాస్తిని పై కోర్టువారిచే జప్తు చేయు నిమిత్తం ఇ.పి. 106/2024ను దాఖలు చేయగా, సదరు కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తెలిసి కూడా తీసుకొనక కాలయాపన చేయుచున్నం దున పై కోర్టువారు ది. 19-03-2025 ఉదయం 10-30 గం.లకు మీరుగానీ, మీ ద్వారా న్యాయవాది గారు గానీ హాజరు కాబడి మీ ఆక్షేపణలు తెలియజేయ గలరు. లేనియెడల పై కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 19-03-2025

ఇట్లు

వి.విశ్వేశ్వర శాస్త్రి, డిహెచ్ఆర్ తరపు న్యాయవాది, తెనాలి.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, పెదవడ్లపూడి నివాసి ప్రస్తుత డోరు నెం: 3-72, మెడల్ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం: 2201, కూకట్ పల్లి, కెనడీ హైస్కూలు రోడ్, హైదరాబాద్ కాపురస్తుడు మాదినేని వెంకట్రామయ్య గారి కుమారుడు సీతారామయ్య గారి నుండి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పెదవడ్లపూడి గ్రామ సర్వే నెం: 43/1 దులో య. 1-30 సెంట్లు భూమిని కొనుగోలు చేసి, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో ది 30-7-2010న విక్రయ దస్తావేజు నెం.5676/2010గాను రిజిస్టరు చేయించుకున్నారు.సదరు రిజిస్టరు దస్తావేజు పెదవడ్లపూడిలోని మా క్లయింటు యొక్క ఆఫీసు నుండి తీసుకొని ది21-2-2025నసదరు ఒరిజినల్ దస్తావేజును జిరాక్సు తీయించుటకు మాక్లయింటు తన మోటారు సైకిల్ మంగళగిరి వెళ్లు వుండగా సదరు ఒరిజినల్ దస్తావేజు మార్గ మధ్యలో పోయినది. మా క్లయింటు ఎంత వెతికినను ఒరిజినల్ దస్తావేజ నెం.5576/2010 దొరక లేదు. మా క్లయింటుకు సంబంధించిన మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం లో దస్తావేజు నెం: 5576/2010 గా రిజిస్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజు ఎవ్వరికైనా దొరికినచో దానిని మాకు గాని, మాక్లయింటుకు గాని అందజేయవలసి నదిగా కోరుచున్నాము. అట్లు కాక సదరు దస్తావేజును దుర్వినియోగం చేయుటకు ప్రయత్నించిన యెడల మా క్లయింటు తీసుకొను సివిల్/ క్రిమినల్ చర్యలకు బాధ్యులుకాగలరు అని తెలియ చేయడమైనది.

వుయ్యూరు బాపి రెడ్డి B.Com., B.L., ఈమని అశోక్ రెడ్డి, B.Com, B.L., ఈమని గోవర్ధలక్ష్మి, M.A.,B.L., న్యాయవాదులు, మంగళగిరి, గుంటూరు జిల్లా, సెల్ :9849531449, 9247768630

రెండ్రోజుల్లో ఇళ్లకూ స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయిందని, వ్యాపార సంస్థలకు 30 వేల వరకు ఏర్పాటు చేశామని ఆధాని గ్రూపు ఉద్యోగులు తెలిపారు. రాగన్నపాలెంలో ఒక వ్యాపార రంగ సంస్థలో మీటర్ల ఏర్పాటుకు మంగళవారం వచ్చిన వీరు పలు విషయాలు తెలిపారు. రెండ్రోజుల తర్వాత ఇళ్లకూ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రారంభిస్తామని, 60 వేల వరకూ ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. మొత్తంగా 90 వేల నుంచి లక్ష వరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. రీఛార్జ్ కోసం చిప్‌లు, సోలార్ సిస్టం కనెక్షన్ ఈ స్మార్ట్ మీటర్లకు ఉంటుందని, సాధారణ మీటర్ మాదిరీగానూ ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం సాధారణ మీటర్‌లాగా పనిచేస్తుందని, త్వరలోనే స్మార్ట్ తరహాలో పని చేస్తాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎవరైనా ఈ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తే విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి వారితో మాట్లాడి మీటర్‌ను ఏర్పాటు చేసుకునేలా ఒత్తిడి చేస్తున్నారు.

శైవక్షేత్రాలకు 45 ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల ఆర్‌టిసి బస్టాండ్ నుండి ప్రముఖ శైవక్షేత్రాలకు 45 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద ఆయన మాట్లాడుతూ మాచర్ల నుండి సత్రశాల, శ్రీశైలంకు ఎక్కువ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. సత్రశాలకు 30, శ్రీశైలంకు 6 అవసరాన్ని బట్టి 15 బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. గురజాల నుండి దైదకు 3, మాచర్ల - దైదకు 3, మన్నేపల్లి 1, తేరాల 1 సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌టిసి బస్సులు దేవాలయాల సమీపం వరకు వెళతాయని, ఇతర వాహనాలను సుదూరంగా నిలిపి వేస్తారని చెప్పారు. శైవక్షేత్రాలకు వెళ్లేవారు ప్రమాద రహితంగా ఉండే ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్య, సూపర్‌వైజర్ బాలునాయక్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పుల్లరి పోరాట వీరుడు కన్నెగంటి హనుమంతు

ప్రజాశక్తి- మాచర్ల

దేశంకోసం, ప్రజల రక్షణకోసం ఆంగ్లేయులపై మహత్తర సహాయ నిరాకరణోద్యం జరిపి, తన రక్తంతో భరతమాత నుదిటిన అరుణ తిలకం దిద్ది ప్రాణ త్యాగం చేసిన పల్నాటి హనుమంతు చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమైనదే. ఒక నాడు పౌరుషాల పోరాటంతో వీరుల రక్తంతో తడిసిన నేల. అటువంటి గడ్డపై దుర్గి మండలం మించాలంపాడులో కన్నెగంటి వెంకటప్పయ్య, అచ్చమ్మ దంపతులకు హనుమంతు జన్మించాడు.

1920-22 నాటి పల్నాడు పరిస్థితులు

1920-21 మధ్య పల్నాడు ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులున్నాయి. పల్నాడు తాలూకాలోని 66 గ్రామాల్లో దుర్భిక్షం నెలకొంది. ఇక్కడంతా చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు అధికం. నీటి వనరులు లేని మెట్ట ప్రాంతం కావటంతో ప్రకృతి కరుణిస్తేనే పంటలు పండేవి. పండకపోయినా గ్రామాధికారులు ముక్కుపిండి శిస్తులు వసూలు చేసేవారు. మామూళ్లు అనేకం ఇవ్వాల్సి వచ్చేది. పైగా తీవ్ర పశుగ్రాసం కొరత. అటవీ సంపదపై బ్రిటీష్ ప్రభుత్వం పన్నులు విధించి ప్రజలను మరింత ఇబ్బందిపాలు చేసింది. శిస్తు చెల్లించకుండా ఆడవుల్లో పశులను మేపకూడదు. పుల్లలు ఏరుకోకూడదు. నీటి వనరులను కూడా వాడుకోకూడదు. ఈ అన్యాయాలపై ప్రజల విజ్ఞప్తుల మేరకు జస్టిస్ పార్టీ తరుపున కట్టమంచి రామలింగారెడ్డి పల్నాడుకు వచ్చి పరిశీలించారు. అనంతరం అడవులకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో శిస్తు వసూలు రద్దు చేయాలని తీర్మానం మద్రాసు శాసనసభలో ప్రతిపాదించినా బ్రిటీష్ ప్రభుత్వం లక్ష్యపెట్టలేదు.

1920లో సహాయ నిరాకరణోద్యమ పిలుపు నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్యమానికి కాంగ్రెస్ నాయకులు కొన్ని షరతులు పెట్టగా వీటిని అంగీకరించని కమ్యూనిస్టులు శిస్తు నిరాకరణకు అనుమతివ్వాలని కాంగ్రెసు నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి పల్నాడు, పెదనందిపాడులో శిస్తునిరాకరణకు పిలుపునిచ్చారు. మించాలపాడు కేంద్రంగా కన్నెగంటి హనుమంతు నేతృత్వంలో 10కి పైగా గ్రామాలు పూర్తిగా శిస్తు చెల్లించటం నిలిపివేసి, అధికారులను బహిష్కరించారు. వెల్దుర్తిలో పశువులను అధికారులు బందెకు తోలుకొని పోతుండగా ప్రజలు తిరగబడ్డారు. జెట్టిపాలెం, జంగమమేశ్వరపురం, రామాపురం, మించాలపాడు, ముటుకూరు, మాచర్ల తదితర గ్రామాల్లోలనూ ఇలాంటి పోరాటాలే జరిగాయి. దీంతో అదనపు బలగాలతో ప్రజలపై బ్రిటీష్ పాలకులు ఉక్కుపాదం మోపారు. ఇళ్లను లూటీ చేశారు. వందలాది మందిని అరెస్టు చేసి శిక్షించారు.

హనుమంతు వీరమరణం

మూడు వైపుల కొండలు, ఒకవైపు అడవితో 80 కుటుంబాలున్న చిన్న గ్రామం మించాలపాడు. ఆ ఊరి కరణం యండపల్లి సదాశివయ్యకు హనుమంతు కంటిలో నలుసుగా తయారైడయ్యాడు. గ్రామ పరిసర ప్రాంతాల్లో సదాశివయ్య దోపిడి సాగటం లేదు. దాంతో కక్ష గట్టిన సదాశివయ్య పోలీసులకు హనుమంతుపై చాడీలు చెప్పాడు. 1922 ఫిబవరి 26 ఆదివారం రోజున అసిస్టెంటు కన్‌సర్వేటర్ రేంజర్లు 14 మంది గార్డు వాచర్లు మించాలపాడు వచ్చి అటవీ పుల్లరి కట్టనందుకు పశువులను బందెలు దొడ్డికి తోలుక పోతామన్నారు. మధ్యాహ్నానికల్లా దుర్గి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య, కరణం సదాశివయ్య, రిజర్వు పోలీసులతో వచ్చి పశువులను దుర్గి బందెలకు తోలుకొని పోసాగారు. హనుమంతు మేనల్లుడు పశుపులేటి చెన్నయ్య వారిని అడ్డగించగా తుపాకీ మడిమతో పొడిచారు. దాంతో సపివాడిని ఎందుకు కొడతారు.. పశువుల్ని వదలండని.. కేకలు వేస్తూ ముందుకు వస్తుంటే, అతను దగ్గరకొస్తే మనల్ని బతకనివ్వడని కరణం చెప్పగా వెంటనే పోలీసులు హనుమంతునిపై కాల్పులు జరిపారు. తుపాకీ గుండ్లు డొక్కలో దూసుకెళ్లాయి. అడ్డుపోయిన హనుమంతు పాలేరు యల్లంపల్లి శేషును కూడా కాల్చారు. నేలకొరిగి కూడా హనుమంతు అధికారులతో ధైర్యంగా వాగ్వాదం చేశాడు. భార్య గంగమ్మ హనుమంతుకు మంచినీళ్లు ఇవ్వటానికి ముందుకువస్తే ఆమెను కొట్టారు. రాత్రి 12 గంటలకు హనుమంతు ప్రాణం విడిచాడు. పాలేరు శేషయ్య తోబాటు ఇన్‌స్పెక్టర్ గుర్రపువాడుకి తుపాకి గుండు తగిలి ప్రాణాలు విడిచారు. 9 మంది స్త్రీలతో సహా 20 మందికి గాయాలయ్యాయి. 27వ తేదీన ఆ ముగ్గురి భౌతికకాయాలను కోలగుట్లకు చేర్చి ఊరి వెలుపుల దంతెవాగు ఒడ్డున ఖననం చేశారు. ఇది జరిగిన నాలుగు రోజులకు హనుమంతు భార్య సమాధి వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా దాన్ని బ్రిటీష్ అధికారులు ధ్వంసం చేశారు. గ్రామస్తులు తిరిగి 20 రోజుల తరువాత సమాధి వద్ద మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. హనుమంతు మరణించిన మరుసటి రోజు తెల్లవారుజామున కలెక్టర్, సూపరింటెండెంట్, 20 మంది అశ్విక దళంతో గ్రామాన్ని చుట్టుముట్టి స్థానికులను వెలుపలకు పలిపించారు. ఇళ్లను దోచుకున్నారు. 36 మందిని అరెస్టు చేయగా 16 మందికి సంవత్సరం చొప్పున కఠిన శిక్షలు విధించారు. ఇదిలా ఉండగా కోలగుట్ల వద్ద దంతెవాగు వడ్డున హనుమంతు స్మారకాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు నర్సరావుపేట సెంటర్‌నందు, మాచర్ల, గురజాల, దుర్గి గ్రామాల్లో హనుమంతు విగ్రహాలను ఏర్పాటు చేశారు.

వలస కూలీల ఆటో బోల్తా - ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మిర్చి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి ఏడుగురికి గాయాలైన ఘటన మండలంలోని కట్టమూరు వద్ద మంగళవారం జరిగింది. తెలంగాణ సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న గ్రామాలకు చెందిన సుమారు 60 మంది కూలీలు మిర్చికోతలకు కట్టమూరుకు వలసొచ్చారు. 20 మంది కూలీలతో వెళుతున్న ఆటో గోరంట్ల రోడ్డులో ఉన్న కోళ్ల ఫారం సమీపంలో బోల్తా పడి సూర్యాపేట జిల్లా దోసపాడుకు చెందిన సిరిపాటి రేణుక, సిరిపాటి వెంకన్న, మద్రిపడకు చెందిన కడమంచి రమ్య, కూరపాటి రమ్య, కుడకడకు చెందిన ఎల్లప్ప, పస్తా సాంబయ్య, వల్లభాపురానికి చెందిన సిరిశాల సతీష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ అధికారులకు తరలించారు. సాంబయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు : మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా పరిశీలకులు వాకాటి అరుణ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో

ఏర్పాటు చేయాల్సిన వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనలో తహశీల్దార్ విజయశ్రీ, ఎంపిడిఓ హేమలత, ఈవోపీఆర్డి జాకీర్ హుస్సేన్, వీఆర్వోలు కెఎ చారి, రపుల్ల పాల్గొన్నారు.



నిజాయితీ ఉన్న అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం - గుంటూరు జిల్లా కోర్టులో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యలపై కెఎస్ లక్ష్మణరావు ఎమ్మెల్సీగా గత 14 సంవత్సరాలుగా నిజాయితీగా చేసిన కృషే ఆయనకు అతిపెద్ద బలమని పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రాజకీయాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజల నుండి విస్తారమైన ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. లక్ష్మణరావు గెలుపు కోరుతూ మంగళవారం జిల్లా కోర్టులో ప్రాంగణంలో న్యాయవాదుల్ని, సిబ్బందిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం వివిధ విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. లక్ష్మణరావు ఎమ్మెల్సీగా గత 14 ఏళ్లలో ఎటువంటి అవినీతి మరకలు లేకుండా నిజాయితీగా ప్రజల పక్షాన పోరాటాల నిర్వహించారన్నారు. మండలిలో ప్రజాగళం వినిపించడం కోసం పిడిఎఫ్ అభ్యర్థులు అవసరం అని అన్నారు. అనేక సందర్భాల్లో వివిధ రకాలలో ప్రలోభాలకు గురి చేయాలని ప్రయత్నాలు చేసినా వాటన్నిటిని తిప్పికొట్టి నిజాయితీ వైపు మాత్రమే నిలిచారన్నారు. వందలాది మంది కార్యకర్తలు స్వచ్ఛందగా ఆయన గెలుపు కోసం కృషి చేస్తున్నారన్నారు. రానున్నటువంటి రెండు రోజుల్లో ప్రలోభాలకు అధికార పార్టీ గురిచేయాలని చూసినా వాటన్నిటిని విజ్ఞులైన పట్టభద్రులు తిప్పుకొడతారని, ప్రజా పక్షాన నిలిచే పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం కషి చేయాలని కోరారు. సోషల్ మీడియాలో వివిధ రకాల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, నిజంగా నిజాయితీగా ఎదుర్కొనే ధైర్యం లేక ఇటువంటి చవక బారు రాజకీయాలు చేయుట సరికాదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు అన్ని విషయాలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ, టి.ఆర్.రమేష్, జాషువా, బి.లక్ష్మణరావు, రమేష్ పాల్గొన్నారు.

న్యాయవాదులను ఓట్లు అభ్యర్థిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

కెఎస్ లక్ష్మణరావుకు సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న పి.డి.ఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ రాష్ట్ర కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ విద్యావేత్త, మేధావి, నిరాడంబరుడు, ప్రజా సమస్యల పట్ల చిత్త శుద్ధి ఉన్న నాయకుడు లక్ష్మణరావు అని అన్నారు. గత 3 దఫాలుగా ఆయన ఎమ్మెల్సీగా మండలిలో ప్రజావాణి వినిపించడంలో, ప్రజా సమస్యలపై విజ్ఞప్తులను ఇవ్వటమే కాకుండా, వాటి పరిష్కారం కోసం నిరంతరం ఆందోళన ఉద్యమాల నిర్వహిం చటంలో ఆయన అగ్రభాగాన ఉన్నారన్నారు. గుంటూరు జిల్లాలోనూ రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడుతున్నా రన్నారు. లక్ష్మణరావు వంటి వారు మండలిలో అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రత్యేకించి గత ప్రభుత్వంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూ కూడా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రివర్స్ పిఆర్‌సి వ్యతిరేక పోరాటం, జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఓపిఎస్ కావాలని జరిగిన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని అనేకసార్లు అరెస్టులు అయ్యారని గుర్తు చేశారు. అంగన్వాడీలు, మున్సిపల్ వర్కర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెలకు మద్దతుగా నిలిచారన్నారు. కావున కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థిని ప్రథమ ప్రాధాన్యతా ఓటుతో గెలిపించండి

ఊరు..వాడా ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లి రైస్‌మిల్లులో లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో పజా సంఘాల నాయకులు ఎం రవి, వి. వెంకటేశ్వరరావు, జొన్న శివశంకరరావు, కె ఈశ్వర్ రెడ్డి, బి పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తాడే పల్లి పట్టణంలో పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. తాడేపల్లి రూరల్ మండలంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి లక్ష్మణరావుకు ఓటు వేయాలని ప్రచారంచేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు , బూరుగ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కొలనుకొండ ప్రచారంలో నాయకులు డి వెంకటరెడ్డి, కార్యదర్శి పల్లె కృష్ణ, నాగ పోగు విజయరాజు, కాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు. దుగ్గిరాల మండలంలో చింతలపూడి ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నాయకులు జెట్టి బాలరాజు, స్టాలిన్ తదితరులు ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి : వైసిపి

ప్రజాశక్తి - మంగళగిరి : పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించడానికి వైసిపి కార్యకర్తలు కృషి చేయాలని వైసిపి మంగళగిరి నియోజకవర్గం ఇంచార్జ్ డి వేమారెడ్డి అన్నారు. మంగళవారం మంగళగిరి వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆపార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వైసిపి నాయకులు ఈదులముడి డేవిడ్ రాజు, మల్లవరపు సుధారాణి, మేడ వెంకటేశ్వరరావు, కసినేడి బాజీ గంగాధర్ రావు, ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, అమరా నాగయ్య, తాడిపోయిన శివ గోపయ్య, పాటిబండ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా చర్యలు చేపట్టాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి కోరారు. ఈ మేరకు డిఆర్‌ఒకు సిపియం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత అనుభవాల రిత్యాను, ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన సంఘటనల అధారంగా 27న జరగనున్న పోలింగ్‌లో తగు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గుంటూరు నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలోని 222 నుండి 226 వరకూ గల 8 పోలింగ్ కేంద్రాలు, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలోని 227, 228, 229 పోలింగ్ బూత్‌లు, అలాగే తెనాలి పట్టణంలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని 292 నుండి 298 ఉన్న ఏడు బూత్‌లు, రావిసాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలోని 302 నుండి 304 వరకు, దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలోని 309 నుండి 312 వరకు ఉన్న ఐదు బూత్‌లలో ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తుగా అవసరమైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటామని డిఆర్‌ఒ హామీ ఇచ్చారు.

సూపర్ సిక్స్‌ను గాలికొదిలిన ప్రభుత్వం

ఉద్యోగులకు పిఆర్సీ, నిరుద్యోగులకు భృతి ఎక్కడ ? : సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సభలో మాట్లాడుతున్న వై నేతాజి

ఎన్నికల ముందు హామీలు గుప్పించి... ఆ తర్వాత హామీలను గాలికి వదలడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. మండలంలోని కాజా గ్రామంలో సిపిఎం రాష్ట్ర కమిటీ పూర్వ సభ్యులు సింహాద్రి శివారెడ్డి 8వ వర్ధంతి సభ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈదా ప్రతాప రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత శివారెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడారు. ప్రజలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన శివారెడ్డి స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజల సమస్యలపై మండలిలో గళమెత్తే ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావుకు మరొకసారి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వంతపాడుతుంది తప్ప హామీలు అమలుకు కృషి చేయడం లేదన్నారు. ఉద్యోగుల పిఆర్సీ, నిరుద్యోగ భృతి ఎక్కడ అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్టు ఉద్యోగలను రెగ్యులరైజ్ చేస్తామని వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బడ్జెట్లో నిధుల కేటాయింపు నామమాత్రంగానే ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మంచి బడ్జెట్ అని చెప్పుకోవడం విచిత్రంగా ఉందన్నారు. అప్పుకు మాత్రమే అనుమతిస్తుంటే నిధులు ఇస్తున్నారని చెప్పుకోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటా యించకుండా కార్పొరేట్లకు ఊడిగం చేసేలా అనకాపల్లిలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో అటువంటి అంశాలపై ప్రశ్నించే గొంతుక ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అని, అటువంటి ఆయనను గెలిపించి శాసనమండలికి పంపిం చాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలంతా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మరొకసారి గెలిపించి శాసనమండలికి పంపాలన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ కె . హరికిషోర్ మాట్లాడుతూ ఐక్యమత్యంగా ఉద్యమ సారధులను గెలి పించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో దిగజారుడుతనానికి పాల్పడుతున్న టిడిపికి 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో పరాజయం తప్పదని హెచ్చరించారు. భూ కబ్జాదారులను గమనించాలన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులను తీరని అన్యాయం చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పక్కన పెట్టేసారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రశ్నించే ప్రతినిధుల ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ ఎన్నికలలో లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటుతోనే భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భీమిరెడ్డి కోటేశ్వరి, తమ్మా ప్రసాద్ రెడ్డి, సింహాద్రి కోటిరెడ్డి, సింహాద్రి సుమ, సింహాద్రి ఆదిశేకర్, నిర్మల పాల్గొన్నారు.

ఎఐతో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-గుంటూరు

కన్నెగంటి రామారావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

డిజిటల్ కార్పొరేట్ రంగంలో భాషా డేటా అనువాద ప్రక్రియ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎఐ అను సంధానంతో టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసు కుంటు న్నాయని, కంప్యూటర్ సైంటిస్ట్, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్, స్టార్టప్ ఫౌండర్ డాక్టర్ కన్నెగంటి రామారావు అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో మంగళవారం 'ఎంప్లాయర్ ఎక్స్‌పెక్టేషన్స్ ఇన్ ది ఎరా ఆఫ్ ఎల్‌ఎల్‌ఎం ఎస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా వచ్చి ఎఐ ఆధారిత టూల్స్, పెద్ద భాషా మోడల్స్, ఎల్‌ఎల్‌ఎంల ద్వారా వేగంగా, సమర్థవంతంగా జరిగే కంటెంట్ క్రియేషన్, డేటా, కమ్యూనికేషన్ తదితర అంశాలను గూర్చిన విశ్లేషణ అందించారు. కంపెనీల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవటం ఎంతో ముఖ్యమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యం బ్లూమ్స్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డు అందుకుంటున్న భాష్యం సాకేత్‌రామ్

విద్యారంగంలో సంభవిస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుంటూ నేటితరం విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు భాష్యం బ్లూమ్స్ నిర్విరామంగా కషిచేస్తుందని భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ అన్నారు. ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ - ఎంపవరింగ్ ఇండియా 3వ ఎడిషన్ ప్రకటించిన ఫలితాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున భాష్యం బ్లూమ్స్ పాఠశాల సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ ను కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ వర్మ పాల్గొని అవార్డు ప్రదానం చేసినట్లు సాకేత్‌రామ్ తెలిపారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈఓ వరలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ అడ్వైజర్ రాజా, బ్లూమ్స్ ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణస్వామి

ఘనంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళ వారం హాస్పిటల్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితోపాటు గతేడాదిలో హాస్పిటల్‌లో చికిత్స పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి శారద మాట్లాడుతూ అమెరికా, లండన్ వంటి నగరాల్లోని హాస్పిటల్స్‌కి ఏమాత్రం తీసిపోని విధంగా శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలు, అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో శ్రేష్ఠ హాస్పిటల్స్ మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో చికిత్స పొందిన పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో హెర్నియా ఆపరేషన్ కోసం శ్రేష్ఠ హాస్పిటల్స్‌కి వచ్చానని, అన్ని తెలిసి కూడా చేసిన నిర్లక్ష్యం వలన అటువంటి క్లిష్ట పరిస్థితి వచ్చిందని, కానీ శ్రేష్ఠ హాస్పిటల్స్‌లోని అధునాతన చికిత్సతో త్వరగా నయం అయిపోయి ందని ఆనందం వ్యక్తం చేశారు. పర్రెపాటి సురేష్, పురుషోత్తం, భాస్కర్‌రావు తమ అనుభవాన్ని తెలియజేశారు. అనంతరం హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి హాస్పిటల్ స్టాఫ్‌కి బెస్ట్ ఎంప్లాయి అవార్డు అందించారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ హెచ్‌ఎం వై.హనుమంతరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇదే హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి షేక్ సుభాని పరీక్ష సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గద్దె హరిబాబు, షేక్ మీరావాలి, రిటైర్డ్ డ్రాయింగ్ ఉపాధ్యాయులు వల్లూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మిర్చి పొలంలో ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న మిర్చి పొలాన్ని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ పరిశోధనా బృందం మంగళవారం పరిశీలించింది. అభ్యుదయ రైతు డి.శేషారావు పొలాన్ని సందర్శించారు. ఈ పొలంతోపాటు ఇతర సాధారణ పద్ధతుల్లో సాగైన పొలాలకు మధ్య వ్యత్యాసాన్ని గమనించారు. అంతర పంటలు, వాటిద్వారా వచ్చే ఆదాయం, పిఎండిస్ వల్ల ప్రయోజనాలు, పైరుకు వాడిన కషాయాలు, ఖర్చు తదితర వివరాలు నమోదు చేశారు. పలు అంశాలను పల్నాడు జిల్లా డిపిఎం అమల కుమారి వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు హిమబిందు, లీలావాణి, లాంఫామ్ ప్రధాన శాస్త్రవేత్త వై.రాధ, జడ్.బి.ఎన్.ఎఫ్ సిబ్బంది అమూల్య, ఉదయలక్ష్మి, మహబూబ్బీ, జ్యోత్స్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ పల్నాడు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- మాచర్ల

లయన్స్ క్లబ్ పల్నాడు సేవలు అభినందనీయమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం లైన్స్ క్లబ్ పల్నాడు ఆధ్వర్యంలో ఆర్టీసీ వాలంటీర్లకు ఉచితంగా టోపీలు, విజిల్స్, బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి అధ్యక్షత వహించగా చైర్మన్ మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంపులు, నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న లైన్స్‌క్లబ్ సభ్యులను అభినందించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కెపి చంద్రశేఖర్‌రెడ్డి, అంక ప్రకాష్, నరసింహారావు, పాస్ట్ రీజన్ చైర్మన్లు ముందూరు వెంకటేశ్వర్లు, కుర్రి సాయి మార్కొండరెడ్డి, పాస్ట్ జోన్ చైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, సభ్యులు అల్లం కోటిరెడ్డి, జెబీవుల్లా, బత్తుల ఏడుకొండలు, డాక్టర్ వీడేల హరీష్, సిహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌమార బాల, బాలికలకు ప్రత్యేక వైద్య సేవలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌమార బాల బాలికలకు ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కౌమార వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, రక్తహీనత నివారణ తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందిస్తామన్నారు.

హెచ్‌బి శాతం ఆధారంగా చికిత్స

బాలికల్లో ప్రధానంగా హిమోగ్లోబిన్ (హెచ్‌బి) శాతం ఆధారంగా రక్తహీనత ఉన్న వారికి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తారని చెప్పారు. హెచ్‌బి 7 గ్రాముల లోపుంటే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు రోజుకి 2 చొప్పున అందిస్తారని, 8 నుంచి 11 గ్రాముల లోపు ఉంటే రోజుకు ఒక మాత్ర చొప్పున అందిస్తారని, మాత్రలతో రక్తహీనత నివారణ కాదనుకుంటే ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ ఇస్తారని, హెచ్.బి 4 లేదా 5 గ్రాములున్న వారికి రక్తం ఎక్కిస్తారని వివరించారు.

రక్త హీనత - చుట్టుముట్టే ఆరోగ్య సమస్యలు

రక్తహీనత వల్ల తరుచూ అనారోగ్యం బారిన పడతారని, ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉందని డాక్టర్ జగన్ నరసింహారెడ్డి తెలిపారు. రక్తహీనత వల్ల తరుచూ తలనొప్పి రావడం, కళ్లు తిరగడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వంటి లక్షణాలుంటాయని, ఛాతిలో నొప్పి, వేగంగా గుండె కొట్టుకో వడం, ఊపిరి తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. అలసట, చిన్నచిన్న పనులకే నీరసం, చేసే పని పట్ల ఆసక్తి, ఏకాగ్రత లేకపోవడం, నాలుక నొప్పి, చర్మం పాలిపోయినట్టు కనిపించడం వంటి లక్షణాలు ఉంటాయని, రుతుచక్రంలో అసమానతలు వస్తాయని తెలిపారు.

డాక్టర్ జగన్ నరసింహారెడ్డి

ప్రజలందరి సమస్యలపై లక్ష్మణరావు పోరాటం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఎమ్మెల్సీగా అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన కెఎస్ లక్ష్మణరావును తిరిగి గెలిపించాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ అన్నారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం చేపట్టారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ పరిరక్షణ ధ్యేయంగా లక్ష్మణరావు పనిచేశారని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలకు కృషి చేశారని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హక్కుల కోసం, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు కోసం పని చేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కొరకు పోరాటం చేసిన చరిత్ర లక్ష్మణరావుదని చెప్పారు. పట్టభద్రులు అందరూ ఆలోచించి రాజకీయాలకు అతీతంగా ఆలోచించి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిఐటియు నాయకులు వి.వెంకట్రావ్, సురేష్‌లు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్ ప్రొవిన్సియల్ సిస్టర్ రెవ.యాన్ రోస్, సిస్టర్ గీత అన్నారు. మంగళవారం మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను వారు సందర్శించారు. విద్యార్థులకు చదువుపై అవగాహన ఎలా పెంచాలో, 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సిస్టర్ రెవ. యాన్ రోస్ వివరించారు. ఈ ఏడాది జాతీయ స్థాయిలో సాఫ్ట్‌బాల్, చెస్ క్రీడల్లో విద్యార్థులు రాణించడంపై హర్షం వ్యక్తం చేశారు. వారికి ప్రత్యేకంగా మెడల్స్ వేసి అభినందించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియ సుజాత, సిస్టర్ శ్వేత, పిఇటి కుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

హైకోర్టు నోటిఫికేషన్‌ను నిలిపేయాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన జూనియర్ సివిల్ జడ్జ్ నోటిఫికేషన్ తక్షణమే నిలుపుదల చేయాలని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు బొక్క సంగీతరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్‌ను నియమించిందని, ఆ కమిషన్ నివేదిక రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈలోగా రావాల్సిన ఉద్యోగాల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసిందని, అదేరీతిలో హైకోర్టు నోటిఫికేషన్ కూడా నిలిపేయాలని కోరారు. లేకుంటే మాదిగ న్యాయవాదులు నష్టపోతారని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేటలోని బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2007-08 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారికి విద్య నేర్పించిన గురువులను సత్కరించారు. నిరుపేద విద్యార్థులకు సహాయంగా ఉంటామని భరోసానిచ్చారు. పాఠశాలకు ఇన్వర్టర్‌ను బహూకరించారు. విద్యార్థులకు భోజనం కోసం 100 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రమణ కుమారి, శిరీష్ బాబు, రమేష్ బాబు, సుబ్బారావు, చుక్క నాగభూషణం, సురేష్ బాబు,వరలక్ష్మి సుభాని, ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్, అధ్యాపకులు సుధాకర్, రేమి బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆకుల శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థి పమిడిపల్లి అనిల్ రాజ్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో జైభారత్ స్కూల్ విద్యార్థినికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - క్రోసూరు

సత్తెనపల్లిలోని ఎస్‌బిజి కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని గుగ్గిలం విద్యాసిరి ద్వితీయ బహుమతి సత్తా చాటినట్లు క్రోసూరులోని జైభారత్ స్కూల్ డైరెక్టర్ జైనేంద్రరెడ్డి తెలిపారు. ఇందుకుగాను ఎస్‌బిజి విద్యా సంస్థల చైర్మన్ మట్టా సుబ్రహ్మణ్యం రూ.3వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారని తెలిపారు. మరో విద్యార్థిని బొల్లా భవిత కూడా కన్సోలేషన్ బహుమతి అందుకుందన్నారు. వీరిని హెచ్‌ఎం షేక్ ఖదీర్, 10వ తరగతి డీన్ తిరుపతి స్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

పదో తరగతి విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బోయపాలేనికి చెందిన బద్దుల బ్రహ్మయ్య జ్ఞాపకార్థం ఉన్నవ జెడ్‌పి పాఠశాలలో 104 మంది పదో తరగతి విద్యార్థులకు బద్దుల సుబ్బారావు, ఆయన కుమారుల ద్వారా పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. 2002 నుంచి ఇలా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ నాయక్, నాగ శంకరం, అల్లావుద్దీన్, రవికుమార్, హరీష్, నాగేశ్వర నాయక్, కామినేని సుబ్బారావు పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలుకు ఆదేశాలు

ప్రజాశక్తి - తెనాలి

ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణంలో 26 పోలింగ్ కేంద్రాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ లో భాగంగా భారతీయ న్యాయ సంహిత మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సాయంత్రం నుంచి మార్చి 5వ తేది వరకు 144 సెక్షన్ అమలుకు తహశీల్దార్ కెవి గోపాలకష్ణ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎలాంటి అవాంఛ నీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అలాగే వచ్చే నెల ఒకటి నుంచి 20తేది వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో కేటాయించిన 12 పరీక్ష కేంద్రాల పరిధిలో, పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలుకు ఆదేశించారు. జిరాక్స్ కేంద్రాలు పరీక్ష కేంద్రాల పరిధిలో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎలక్షన్లు, ఇంటర్ పరీక్షలు దష్టిలో ఉంచుకుని 144 సెక్షన్ అమలుకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

కోటప్పకొండలో పోలీస్ సిబ్బందికి తులసీ సీడ్స్ భోజన సదుపాయం

ప్రజాశక్తి-గుంటూరు : మహా శివరాత్రి సందర్భంగా కోటప్ప కొండ తిరునాళ్లలో భద్రతా పర్యవేక్షణ నిమిత్తం సేవా శిబిరం క్యాంపునకు వచ్చిన 300 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, 3000 మంది పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం తులసి రామచంద్రప్రభు, అరుణ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేసే సేవా కార్యక్రమాలు వారిలో దేశభక్తిని, సేవాతత్పరతను పెంపొంది స్తాయని అన్నారు. దేశాభివద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. గత 14 ఏళ్లుగా పోలీస్ సిబ్బందికి తాము మూడ్రోజులపాటు భోజన సదుపాయాలు అందచేస్తున్నామని చెప్పారు. పోలీసు సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు వెలకట్టలేనివని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఉద్దేశించి తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ గొప్ప లక్ష్యాలను ఏర్పరుచుకొని పట్టుదలతో వాటిని సాధించి,

భోజనాలు వడ్డిస్తున్న తులసి రామచంద్రప్రభు, అరుణ

జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు యోగీష్ మెమెంటోలు అందజేశారు.కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసరు టి.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వి.వి.హరనాధ్, షేక్.దావూద్, ఎస్.అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్ పో ను తిలకిస్తున్న విద్యార్థులు

నెహ్రూ నికేతన్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డు లోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వేగ గణిత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను 'అబాకస్' పేరిట మంగళవారం నిర్వహించారు. విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన ఎక్స్పోలో ఏడో తరగతి వరకు గల విద్యార్థులు పాల్గొని కూడికలు, తీసివేతలు, హెచ్చువేత్తలు, భాగహారాలను అబాకస్ ఫ్రేమ్ ద్వారా సులభశైలిలో వేగవంతంగా పరిష్కరించే విధానాలను విద్యార్థులు వివరించారు. హైదరాబాదుకు చెందిన విశ్వం టెక్ వారి ద్వారా గత తొమ్మిది సంవత్సరాలుగా నెహ్రూ నికేతన్ విద్యార్థులు అబాకస్ లో శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనను విశ్వ ఎడ్యుటెక్ గుంటూరు జోనల్ మేనేజర్ సిహెచ్ గంగాధర్ పర్యవేక్షించారు. గతంలో అబాకస్ పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన ఏడవ తరగతి విద్యార్థిని షేక్ తబసుమ్, ఐదో తరగతి విద్యార్థి డూండి కార్తికేయ కు నిర్వాహకులు పంపిన ప్రశంసా పత్రాలు మెడల్స్ ను గంగాధర్ అందించారు. ఈ సందర్భంగా మురళి కాంత్ దాసరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారిలో మేధాశక్తిని పెంపొందించే ందుకు అబాకస్, కంప్యూటర్స్, రోబోటిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

84వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : చట్ట ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 84 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కే ఆదినారాయణ, వై యెహోషువ, ఎన్ సుబ్బారావు, సల్మాన్, దర్శి మాణిక్యరావు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల శ్రమతో ఈనాడు రూ. వేల కోట్ల విలువ చేసే భూమి యాజమా న్యానికి దక్కిన విషయాన్ని చేశారు. అయినా కార్మికులకు రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వటానికి ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసిన కార్మికులు 170 మంది అర్ధాకలితో చనిపోయిన యాజమాన్యం మనసు కరగటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం యాజమాన్యం, కార్మికులతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ కే ఆరిఫ్, ఆశీర్వాదం, అంకయ్య, ఇస్మాయిల్, రమాదేవి పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి- తాడేపల్లి

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను చాలా రాస్తుందని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను బిజెపి కాల రాస్తుందని మండిపడ్డారు. దేశంలో మూడవ అతిపెద్ద భూ యజమానిగా వక్ఫ్ బోర్డ్ 9 లక్షల ఎకరాలతో స్థిరాస్తులు కలిగి ఉన్నదని చెప్పారు. వక్ఫ్ బోర్డ్ నిర్వీర్యానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం సమైక్యవేదిక దీన్ని తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ముస్లిం సమాజం అనేక త్యాగాలు చేసింద ని గుర్తు చేశారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వాళ్ళ కాళ్లు మొక్కి, ఏ పాత్ర లేనటువంటి ఆర్ఎస్ఎస్, బిజెపి నేడు దేశాన్ని పరిపాలించడం సిగ్గుచేటుఅన్నారు. టిడిపి, జనసేన పార్టీలు ఎప్పటికైనా బిజెపికి మద్దతు విషయంలో పునరాలోచించుకోవాలని కోరారు. వక్ఫ్ బోర్డ్ వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ముస్లిం సమైక్యవేదిక ప్రతినిధులు సర్దార్ ఖాన్, అబ్దుల్ కలాం, సయ్యద్ మహబూబ్, మౌల బిగ్, అబ్దుల్ అజీజ్, సయ్యద్ అబ్దుల్లా, షేక్ మహబూబ్ బాషా, నసీ మా సుల్తానా పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎంటిఎంసి పరిధిలో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నగరపాలకసంస్థ కమిషనర్ ఎస్.అలీంబాషా మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. దేవ స్థానం బ్రహ్మోత్సవాలు ప్రారంభం దృష్ట్యా పారిశుధ్య అంశా లను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

నగరాలు, పట్టణాలు, గ్రామాలను, పరిశుభ్రంగా ఉంచే మున్సిపల్, పారిశుధ్య కార్మికులు సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న దశల వారి ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు జీ దుర్గారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఈ హరిబాబు, రాయుడు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ ఆర్ ఎం హైస్కూల్ పోలింగ్ కేంద్రాల తనిఖీలో అధికారుల బృందం

తెనాలిలో పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - తెనాలి : ఈనెల 27న జరగనున్న కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. సబ్ కలెక్టర్ సంజన సింహ నేతృత్వంలో తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ, కమిషనర్ బి శేషన్న బృందం పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సప్లై, తాగునీరు, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లను పరిశీలిం చారు. గంగానమ్మపేట టిఎస్ఆర్ఎం హైస్కూల్, చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హై స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. బృందంలో మున్సిపల్ ఇంచార్జ్ ఎం ఈ శ్రీనివాసరావు, అధికారి జి ప్రేమ్ సాగర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ప్రజలు అధికారులందరూ సహకరించాలని స్థానిక తాసిల్దార్ ఐ సునీత కొరారు. గురువారం జరిగే ఎన్నికకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 22 54 మంది గ్రాడ్యుయేట్స్ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా దుగ్గిరాలలోని హైస్కూల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల రోజు ఉదయం నుండి రాత్రి వరకు 144 సెక్షన్ విధించినట్లు ఆమె తెలిపారు. మంగళవారం సాయంత్రం నుండి గురువారం సాయంత్రం వరకు డ్రై డే ప్రకటించామని, మద్యం అమ్మకాలు, సేవించడం కానీ చేయరాదని ఆమె తెలిపారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంగన్వాడీ కేంద్రాల్లో బాలలకు మరింత విద్య అందించేం దుకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదప డతాయని మండల విద్యాశాఖాధికారి-2 వి జయంతి బాబు అన్నారు. అంగన్వాడి కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలు కచ్చితంగా కేంద్రాల్లో అమలయ్యేవిధంగా రానున్న రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. మంగళ వారం స్థానిక మారిస్ పేట నల్లమోతు చెంచురా మానా యుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ జయంతిబాబు ప్రాజెక్టు అధికారిగా పాల్గొన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల బాలలకు అభ్యసన అంచనాను క్రమ పద్ధతిలో అనుసరిస్తూ చిన్నారుల అభిరుచులను తెలుసుకోవాలని అంగన్వాడీలకు సూచించారు. అంగన్వాడి సహాయకులకు దశలవారీగా 120 రోజులపాటు వివిధ అంశాలపై ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లావ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పేరిట శిక్షణ కల్పించినట్లు సిడిపిఓ డాక్టర్ ఎం సునీత తెలియజేశారు.

27, 28 తేదీల్లో బి.ఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని బిఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో పైప్‌లైన్ మరమ్మతుల వల్ల తాగునీటి సరఫరాకు 27, 28 తేదీల్లో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయ ంత్రం నుండి శుక్రవారం వరకూ నీటి సరఫరా నిలిచిపో తుందని, 1వ తేదీన యధావిధిగా సరఫరా జరుగుతుం దన్నారు. రానున్న వేసవి దృష్ట్యా మెరుగైన సరఫరా కోసం పైప్‌లైన్ల మరమ్మతులు చేయాలని ఆదేశించామన్నారు. బిఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలోని పాత గుంటూరు, ముగ్దూంనగర్, విజయశాంతినగర్, భగత్‌సింగ్ నగర్, నాగలక్ష్మినగర్, యానాది కాలనీ, దుర్గా నగర్, ప్రియాంక గార్డెన్స్, ఆనందపేట జీరోలైన్, జానీ మత్యుంజయ నగర్, జానీ స్వరాజ్య నగర్, గౌడ కాలనీ, జికె నగర్, ఎల్బీ నగర్, అలీ నగర్, అంకమ్మతల్లి గుడి రోడ్, రాములు వారి వీధి, సత్యనారాయణ స్వామి గుడి వీధి, యాదవుల బజార్, డబ్బాల సందు, పొన్నూరు రోడ్ ఎడమ ప్రాంతం, ఇసుక వాగు వీధి, ముఫ్తీ వారి వీధి, పాల హాస్పిటల్, మేకల వారి వీధి, సేవ సంగంవారి వీధి, లాల్ జాన్ బాష షాదీ ఖానా ప్రాంతం, మంత్రివారి వీధి, సంగడిగుంట, బాబుజి రోడ్, వడ్డే గూడెం, కబాడీ గూడెం, లాంచేస్టర్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న సెక్రెటరీ తదితరులు

పవర్ లిఫ్టింగ్‌లో టిజెపిఎస్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాల విద్యార్థులకు ఈనెల 24వ తేదిన ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీలలో టి.రాజు, జి.వి.నితిన్‌రెడ్డి ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారని కళాశాల సెక్రెటరీ, కరస్పాండంట్ కె.వి.బ్రహ్మం తెలియజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులకు సెక్రెటరీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలంటే స్పష్టమైన లక్ష్యం, అంకిత భావం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కూడిన నేర్పు అంతకు మించి గొప్ప ప్రయత్నం ఉండాలన్నారు. కొన్ని సార్లు విఫలమైనప్పటికీ కుంగిపోకుండా ఓటములను అనుభ వాలుగా మార్చుకొని విజయతీరాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజీ, రసాయన శాస్త్ర విభాగాదిపతి రాజగోపాల్, సల్మా సుల్తానా, డాక్టర్ యు.రవికుమార్, డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

క్వారీ తిరుణాళ్లకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - చేబ్రోలు : మహాశివరాత్రి సందర్భంగా నేడు జరిగే వడ్లమూడి క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లు సర్వం సిద్ధం అని ఆలయ కార్యనిర్వహణాధికారి పోతుల రామకోటేశ్వరరావు , పంచాయతీ కార్యదర్శి జి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. వడ్లమూడి క్వారీ తీరునాళ్లకు మహాశివరాత్రి రోజు వచ్చే యాత్రికులకు, భక్తులకు ఇబ్బందులు లేకుండా తిరునాళ్ల కమిటీ చైర్మన్ మరియు సభ్యులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ఘనంగా ఏర్పాట్లు చేయటం జరిగిందని తెలిపారు. ఎండ తీవ్రత వలన దర్శనాలకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు చలువ పందిళ్ళ కింద ఏర్పాటు చేశామని, ప్రత్యేక దర్శనం , శీఘ్ర దర్శనం, విఐపి దర్శనం ఉచిత దర్శనాలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. 24 గంటలు తాగునీరు, మెడికల్ టీంలు తోపాటు అన్ని ప్రభుత్వ విభాగాల కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఆర్టీసీ మరియు పోలీసు సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. దేవస్థానం ప్రాంగ ణంలో నాలుగు భారీ సిట్టింగ్ ప్రభలు విద్యుత్ ప్రభలు ముస్తాబయ్యాయి. వీటితోపాటు నారాకోడూరులో మూడు , గుండవరంలో రెండు, చేబ్రోలు, గొడవర్రులో ఒక్కొక్కటి చొప్పున భారీ విద్యుత్ ప్రభలు ఆలయ చెంతకు వెళ్లేందుకు గ్రామాల్లో సిద్ధమవుతున్నాయి.

లౌకికవాది కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

ఆవాజ్ వ్యవస్థాపక నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ గఫూర్

మాట్లాడుతున్న గఫూర్

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి రేపు జరిగే ఎన్నికల్లో లౌకికవాది కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని అవాజ్ వ్యవస్థాపక నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మైనార్టీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్సి, ఎన్పిఆర్ పేరుతో సిటిజన్షిప్ యాక్టులో మార్పులు చేసిన సందర్భంలో ముస్లింలు పౌరులు కాదా అనే ప్రశ్న తలెత్తిన నేపథ్యంలో లౌకిక సంఘాల న్నింటినీ కలిపి రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఏర్పాటు చేసి, చేపట్టిన ఉద్యమానికి అన్ని విధాలుగా లక్ష్మణరావు తోడ్పాటు అందించార న్నారు. లౌకిక వాదం పరిరక్షణ కు, మైనార్టీల హక్కుల కోసం పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఏ ఉద్యమం వచ్చినా ఆయన పాల్గొంటున్నారని, వక్ఫ్చట్టంలో సవరణలు చేసి, మైనార్టీల ఆస్తులు కాజేయాలని ప్రయత్నించినప్పుడు దానికి వ్యతిరేకంగా మండలిలో గళం వినిపించారని అన్నారు. ఈ నేపథ్యంలో లౌకిక వాది లక్ష్మణరావు గెలుపు కోసం అవాజ్ కృషి చేస్తుందని, రెండు జిల్లాల్లో విస్తృత ప్రచారం చేపట్టామన్నారు. మైనార్టీల హక్కుల రక్షణ కోసం లౌకిక వాదులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున మొదటి ప్రాధాన్యత ఓటు వేసి లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. సమావేశంలో అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, జిల్లా అధ్యక్షులు భాషా, నాయకులు సలీం, సైదా పాల్గొన్నారు.

గుంటూరులో ప్రచారంలో గఫూర్